సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ǀ 23 ǀ ఆగస్టు ǀ 2024



ఎక్సైజ్ దాడులు..

ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 8లో▸



దరఖాస్తుల పరిశీలన..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. 8లో▸



విధుల్లో గుండెపోటు

బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురైన హెడ్ కానిస్టేబుల్ గురువారం మృతిచెందాడు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

తుక్కుగూడ: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు ఈ నెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి జయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, బీఫార్మసీ కోర్సులు చేసిన వారికి నగరంలోని రిటైల్, ఈ–కామర్స్, బీపీఓ రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9063099306 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్‌గా గోపీకృష్ణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌గా ఎం.గోపీకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన యాదాద్రి నుంచి ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని వివిధ రైస్ మిల్లుల నుంచి సేకరించి, ప్రభుత్వానికి అప్పగించడం, ఎఫ్‌సీఐ గోడౌన్స్‌కు అటు నుంచి రేషన్‌షాపులకు తరలించడం, లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడడంలో ఆయన నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరుంది.

రామ్మోహన్‌రావుకు డాక్టరేట్



బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.రామ్మోహన్‌రావు డాక్టరేట్ అందుకున్నారు. అనంతపురం జేఎన్‌టీయూ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన రామ్‌మోహన్‌రావు డేటా ప్రైవసీ పరిశోధన చేసి పత్రాలు సమర్పించారు. డాక్టర్ ఎస్.మురళీకృష్ణ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించాడు. పీహెచ్‌డీ పట్టా అందుకున్న సందర్భంగా స్ఫూర్తి కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, బంధుమిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

కేశంపేట: ఏళ్ల నుంచి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని యూపీఎస్ సంగెం, పీఎస్ కొండారెడ్డిపల్లి, కేశంపేట, కాకునూర్, కొండారెడ్డిపల్లి, వేములనర్వ, పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేటలో జెడ్పీహెచ్‌ఎస్‌లలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు ఉపాధ్యాయులకు గోవర్ధన్‌యాదవ్ సభ్యత్వాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు అందాల్సిన 50శాతం ఫిట్‌మెంట్, పీఆర్సీ వెంటనే ఇవ్వాలని కోరారు. పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొర్రీలొద్దు.. కోతలొద్దు

రూ.2లక్షల రుణ మాఫీ చేయాల్సిందే

- 'రైతు నిరసన దీక్ష'లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి చిత్రంలో కేటీఆర్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తదితరులు

చేవెళ్ల: రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ పోరుబాట పట్టింది. జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన రైతు నిరసన దీక్ష విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. చేవెళ్ల మార్కెట్ యార్డ్ వద్ద పార్టీ నాయకులు కేటీఆర్‌కు స్వాగతం పలికి అక్కడ నుంచి ర్యాలీగా దీక్షా శిబిరం వద్దకు పాదయాత్రగా చేరుకున్నారు. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాలనుంచి రైతులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కేసీఆర్ మార్క్‌ను చెరిపేయలేరు: సబితారెడ్డి

రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోందని.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.80లక్షల మంది రైతులకు గాను కేవలం 70వేల మందికే మాఫీ అయిందన్నారు. ఎటువంటి కొర్రీలు, కోతలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్వగ్రామంలో సర్వేకోసం వెళ్లిన మహిళా జర్నలిస్టుపై దాడిచేయడం దారుణమన్నారు. సూర్యచంద్రులున్నంత కాలం, తెలంగాణ పదం ఉన్నంత కాలం కేసీఆర్ మార్క్‌ను ఎవరూ చెరిపివేయలేన్నారు. గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి ఆ కాగితాలు ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద పెట్టి ఇదే మార్గంలో వెళ్లే ముఖ్యమంత్రికి అందజేద్దామన్నారు.

అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే: మహమూద్‌అలీ

రైతుల కోసం పనిచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంటే రైతులకు అన్యాయం జరిగేది కాదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాడని ఆరోపించారు. గుజరాత్ మోడల్ సైతం తెలంగాణ రాష్ట్రం ముందు ఎందుకు పనికి రాదన్నారు.

ఉద్యమానికి సిద్ధమవ్వాలి: స్వామిగౌడ్

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా ప్రజలను మోసం చేస్తూనే ఉంటుందని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వంపై ఉద్యమించేందుకు ప్రతీ ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ మారిన నాయకులను మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దని కేటీఆర్‌ను కోరారు. ఉద్యమకారులనే పార్టీ నాయకులుగా తయారు చేసి పార్టీ పునఃనిర్మాణం చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, పార్టీ నాయకులు ఎం.బాల్‌రాజ్, ఆంజనేయులు, అవినాష్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నారాయణ, దశరథ్, స్వప్న, కౌషిక్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, నర్సింలు, యాదగిరి, శివప్రసాద్, చందు, వెంకటేశ్, చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ్‌గౌడ్, సత్తి, మల్లేశ్, ముకుందంగౌడ్, రాంప్రసాద్, కృష్ణారెడ్డి, వెంకటేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మీ ఎమ్మెల్యేను ప్రశ్నించండి: కేటీఆర్

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులను గల్లాపట్టి ప్రశ్నించాలని కేటీఆర్ ప్రజలకు సూచించారు. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. మీ ఎమ్మెల్యే కాలె యాదయ్యను కాంగ్రెస్ ఏం చేసిందని పార్టీ మారారో అడగండన్నారు. ఇటీవల చేవెళ్ల పర్యటనలో ఈ ప్రాంతానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి కేసీఆర్ సీఎంగా లేకపోవడంతో మా ప్రాంతం కలతప్పిందన్నాడని గుర్తు చేశారు. చేవెళ్ల ప్రాంతంలోని పరిశ్రమల ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసిన ఘతన బీఆర్‌ఎస్‌దే అన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతు, ప్రజలు ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా బతకులు ఆగమ

స్నేహితుడే చంపేశాడు

- ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య
- ఛాతి, కడుపు భాగాల్లో కత్తిపోట్లు
- రక్తపు మడుగులో బాధితుడి విలవిల
- బైక్‌పై పరారైన నిందితులు
- బాలాపూర్ ఠాణా పరిధిలో ఘటన



బైక్‌పై పారిపోతున్న నిందితులు



మృతుడు ప్రశాంత్ (ఫైల్)



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి

మహేశ్వరం: తోటి స్నేహితుడే ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని దారుణంగా హత్య చేశాడు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన శాంతయ్య, అనిత దంపతుల కుమారుడు మొండ్రు ప్రశాంత్ (21) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం వీరు బాలాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. గురువారం పరీక్ష ముగిసిన అనంతరం సాయంత్రం 4:30గంటలకు ప్రశాంత్ తన స్నేహితులైన(బీటెక్ క్లాస్‌మేట్స్ కాదు) ముగ్గురితో కలిసి బాలాపూర్ గణేశ్ చౌక్ సమీపంలోని '37 మండీ హౌజ్'కు చేరుకున్నారు. హోటల్ ఆవరణలోని పాన్‌షాప్ వద్ద సిగరెట్ కొనుగోలు చేశారు. ఈ సమయంలో మాటామంతీ కొనసాగిస్తున్న క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి లోనైన ఓ స్నేహితుడు అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతి భాగాలలో పొడిచాడు. తీవ్ర రక్త గాయాలతో బాధితుడు కుప్పకూలిపోగా.. మిగిలిన ముగ్గురూ ఒకే బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులను అడిగి హత్య వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఐటీ, ఎస్‌ఓటీ పోలీసులతో టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. కాగా ప్రశాంత్‌ను కత్తితో పొడిచిన యువకుడు సైతం బాలాపూర్‌లోనే నివాసం ఉంటూ ఓ పార్టీ నాయకుడికి అనుచరుడిగా కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా నలుగురు యువకులు గంజాయి, సిగరెట్లకు బానిసలైనట్లు ప్రాథమికంగా తెలిసింది. కొద్ది రోజులుగా మూతపడి మరమ్మతుల అనంతరం మూడు రోజుల క్రితమే తెరుచుకున్న ఈ హోటల్ వద్ద తరచూ కలుసుకునేవారు. కాగా ఈ హత్యకు ప్రేమ వ్యవహారం ఏదైనా ఉందా..? ఫేమస్ కావాలంటే మర్డర్ చేయాలంటూ నిందితుడు తరచూ స్థానికంగా పేర్కొనేవాడని, దీన్నిబట్టి.. ఫేమస్ కావాలనే హత్య చేశాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 8న సైతం రౌడీషటర్ రియాజుద్దీన్ ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఉదంతం మరువక ముందే మరో హత్య చోటు చేసుకోవడంపై స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి ఈ ప్రాంతాన్ని నేరరహితంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



'ఈ–ఆఫీస్'పై అధికారులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శశాంక

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఈ–ఆఫీస్'
- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మెడికల్ కాలేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహేశ్వరం మెడికల్ కాలేజీ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీలో అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. నియామకాల ప్రక్రియ పూర్తయిందని మిగిలిన పనులను సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీరాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణి, సూపరింటెండెంట్ బి.నాగేందర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ జి.రాజుయాదవ్ పాల్గొన్నారు.

ప్రతీ ఫైల్ ఆన్‌లైన్‌లోనే..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ–ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఈ–ఆఫీస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇకపై కలెక్టరేట్‌లో పేపర్లు, ఫైళ్లు కన్పించొద్దన్నారు. తొలుత వ్యవసాయ శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖ, పంచాయతీ రాజ్, మైనారిటీల సంక్షేమ శాఖ, మెప్మా, మహిళా శిశు సంక్షేమం, డీఆర్‌డీఏలలో ప్రారంభించడం హర్షనీయమన్నారు. ఈ ఎనిమిది విభాగాలు ఇకపై ప్రతీ ఫైలును ఆన్‌లైన్లోనే పంపాలన్నారు. మిగిలిన జిల్లా అధికారులు సైతం మూడు నెలల్లోగా ఈ–ఆఫీస్‌ను అమలు చేయాలన్నారు. దీంతో ఫైల్ ట్రాకింగ్ సులభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఏఓ సునీల్, సీపీఓ సౌమ్య, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, మైనార్టీ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, డీసీసీఓ ధాత్రిదేవి, ఈడీఎం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నో 'స్మార్ట్'..

- కేబీఆర్ పార్క్ వద్ద మల్టీలెవల్ స్మార్ట్ పార్కింగ్ వద్దు
- కార్పొరేటర్ల అధ్యయన యాత్రలు..
- 'ప్రైవేటు' మోడల్ మార్కెట్ ముద్దు
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: కేబీఆర్ పార్క్ వద్ద మల్టీలెవల్ స్మార్ట్ కార్, మోటార్ సైకిల్ పార్కింగ్ పనులు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించేందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ నో చెప్పింది. స్మార్ట్ పార్కింగ్ పైలట్ ప్రాజెక్ట్‌గా కేబీఆర్ పార్క్ ఎంట్రీ గేటు–1 వద్ద డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) పద్ధతిలో టెండర్లు ఆహ్వానించగా, ఎక్కువ ధరకు బిడ్ కోట్ చేసిన నవనిర్మాణ్ అసోసియేట్స్‌కు పనులు అప్పగించేందుకు అనుమతి కోసం అధికారులు స్టాండింగ్ కమిటీ ముందుంచారు. పదేళ్ల కాలపరిమితి.. అనంతరం ఐదేళ్ల పొడిగింపునకు అవకాశం ఉన్న ఈ పనుల్ని అప్పగించేందుకు నిరాకరించిన స్టాండింగ్ కమిటీ సభ్యులు.. సదరు స్థలాన్ని, అక్కడి పరిస్థితుల్ని తాము స్వయంగా పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామంటూ గురువారం జరిగిన సమావేశంలో నో చెప్పారు. మూడు విడతలుగా 150 మంది కార్పొరేటర్ల అధ్యయన యాత్రలకు, మరికొన్ని అంశాలకు పచ్చజెండా ఊపారు.

ఆమోదం పొందిన ముఖ్యాంశాలు..

- ఇందిరాపార్కు– వీఎస్‌టీ వరకు, రామ్‌నగర్–బాగ్‌లింగంపల్లి వరకు ఫ్లై ఓవర్ల పనులకు అంచనా వ్యయం రూ.426 కోట్ల నుంచి రూ.565 కోట్లకు పెంపునకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతించడంతో కమిటీ ఆమోదం
- స్లమ్‌ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత, మహిళలకు నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పించేందుకు బొల్లారం మోడల్ మార్కెట్ భవనాన్ని ఏడాది కాలానికి డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకునేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు అనుమతి.
- 2024 మార్చి నుంచి మే వరకు జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు కమిటీ ఆమోదం.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఆన్‌లైన్ పోర్టల్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేసిన మెస్సర్స్ కోన ఇ–డేటా సొల్యూషన్స్ ఏజెన్సీకి రూ.12,38,534 చెల్లింపులకు ఆమోదం.
- సీఎస్సార్ కింద మియాపూర్ గుర్నాథ్ చెరువు పునరుద్ధరణ పనులు చేసేందుకు మల్లిగా వద్ సంస్థకు ఆర్నెల్ల కాలానికి దత్తత ఇచ్చే ఒప్పందానికి కమిషనర్‌కు అధికారం.
- సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీల మధ్య విడతకు 50 మంది వంతున కార్పొరేటర్లను మూడు విడతల్లో ఆయా నగరాలకు స్టడీ టూర్లకు తీసుకెళ్లేందుకు ట్రావెల్ ఏజెన్సీల నుంచి కొటేషన్ల స్వీకరణకు ఆమోదం.
- సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించగా.. కమిషనర్ ఆమ్రపాలి, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హైడ్రా'పై ప్రభుత్వ నిర్ణయం మేరకు..

హైడ్రా ఏర్పాటు చట్ట విరుద్ధమని, ఏర్పాటు జీఓను వెనక్కు తీసుకోవాలంటూ ఎంఐఎం స్టాండింగ్ కమిటీ సభ్యులు సమావేశంలో మరోసారి మేయర్, కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇదివరకు ఇచ్చిన లేఖను ప్రభుత్వానికి పంపించామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు తాము వ్యవహరిస్తామని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు.

కొంగరకలాన్‌లో కేన్స్

- 46 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సెమీ కండక్టర్ ఉత్పత్తుల తయారీ కేంద్రం
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు
- నేడు ప్రారంభోత్సవం



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ జిల్లాకు కలికితురాయిగా మారనుంది. పరిశ్రమలకు నెలవుగా తయారుకానుంది. ఇప్పటికే జిల్లా హెడ్‌క్వార్టర్‌గా, కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు భారీ పెట్టుబడులతో ఉత్పాదకరంగం, పరిశ్రమలు జాతికి అంకితం కానున్నాయి. తమిళనాడుకు చెందిన ప్రఖ్యాత పారిశ్రామిక వేత్తలు ఈ కంపెనీ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి సహకరించింది.

46 ఎకరాల్లో రూ.3వేల కోట్ల పెట్టుబడి

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్‌రింగ్‌రోడ్డుకు సమీపంలో సర్వే నెంబరు 300లో 46 ఎకరాల్లో కేన్స్ టెక్నాలజీ సెమికండక్టర్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీ ఏర్పాటు చేశారు. శంకుస్థాపన చేసిన ఏడాది లోపే నిర్మాణం పూర్తి చేశారు. కంపెనీ ఏర్పాటుకు రూ.3వేల కోట్ల భారీ పెట్టుబడులు వెచ్చింది. గతంలో ఈ సంస్థ గుజరాత్‌కు తరలిపోనుందని పుకార్లు వచ్చాయి. ఇప్పటికే ఐటీ సంస్థలకు నిలయంగా మారిన ఆదిబట్లలో ఏకంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులతో 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ముందుకొచ్చింది. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. స్థానికులకు సైతం ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

కేన్స్ టెక్నాలజీ సెమీ కండక్టర్ల కంపెనీ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇందుకు తగ్గట్లు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు భారీ షెడ్లు, సమావేశ వేదిక, భోజనాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఐటీ మంత్రి చేతుల మీదుగా..

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కంపెనీని ప్రారంభించనున్నారు. ఇప్పటికే కేన్స్ సీఈఓ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. సీఎం ఢిల్లీ పర్యటనలో ఉన్నందున స్పీకర్ గడ్డం ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరవనున్నారు.

'గాంధీ' కోవిడ్ సేవల్ని గుర్తించిన ఐసీఎంఆర్

గాంధీ ఆస్పత్రి: కరోనా విజృంభణ వేళ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలు అందించిన వైద్య సేవలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) గుర్తించింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం జరిగిన నేషనల్ క్లినికల్ రిజిస్ట్రీ ఫర్ కోవిడ్–19 రిపోర్ట్ రిలీజ్ అండ్ డిస్సమినేషన్ సమ్మిట్‌లో గాంధీ మాజీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ త్రిలోక్‌చందర్‌లను సత్కరించి ప్రశంస పత్రాలు అందించారు. కోవిడ్ విజృంభిస్తున్న తరుణంలో ప్రాణాలకు తెగించి వేలాది మందికి వైద్యసేవలు అందించడంతో పాటు కరోనా వైరస్‌కు సంబంధించిన పలు అంశాలపై రీసెర్చ్ చేసి నివేదికలను అందించారు. కరోనా నియంత్రణ, నివారణ, రూపాంతరం చెందుతున్న వైనం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్ రీసెర్చ్ చేసి రూపొందించిన 15 ఆర్టికల్స్ ఐసీఎంఆర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వీరి రీసెర్చ్ నివేదికలను ప్రపంచ దేశాలు ప్రామాణికంగా తీసుకుని వైద్యసేవలు అందించి లక్షలాది మంది ప్రాణాలు కాపాడారు. ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌భల్, నీతి ఆయోగ్ ప్రతినిధి వినోద్ పాల్, నేషనల్ హెల్త్ మాజీ సెక్రటరీ రాజేష్ భూషణ్‌లు ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు అందించిన సేవలను అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. మెరుగైన వైద్యసేవలు అందించిన గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలకు సర్టిఫికెట్లు జారీ చేశారు. తమ సేవలను గుర్తించడం పట్ల ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

బల్దియా ఆఫీసులోనే డ్రగ్‌మార్ట్!

మేయర్ పేరిట ట్రేడ్‌లైసెన్స్ జారీ?

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా పరిధిలోని ఐటీ పనితీరు గుట్టును మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ (బీజేపీ) మరోసారి రట్టు చేశారు. గతంలో మల్కాజిగిరి జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని తన పేరిట, మేయర్ విజయలక్ష్మి పేరిట అసెస్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా పీటీఐఎన్‌లు జనరేట్ కావడాన్ని ఆయన వెల్లడించిన విషయం తెలిసిందే. దాదాపు లక్ష ఇళ్ల ఆస్తిపన్ను అసెస్‌మెంట్లకు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా తెల్ల కాగితాలను అప్‌లోడ్ చేసినా పీటీఐఎన్ జనరేట్ కావడాన్ని అప్పట్లో గుర్తించారు. ఆ తర్వాతైనా ఐటీని లోపాల్లేకుండా తీర్చిదిద్దలేకపోయారు. తాజాగా మళ్లీ మేయర్ విజయలక్ష్మి గద్వాల్ పేరిటే మల్కాజిగిరి కార్యాలయంలోనే 'డ్రగ్ మార్ట్ ఇన్ కాంగ్రెస్' పేరిట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. జనరేట్ అయిన రూ.350 ఫీజు చెల్లించగానే ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ (టిన్ నంబర్‌తో) జనరేట్ కావడం ఐటీ పనితీరు ఎంత లోపభూయిష్టంగా ఉందో నిదర్శనమంటూ ఆయన పేర్కొన్నారు.

- అయితే.. ఈసారి తన ప్రయత్నం జీహెచ్‌ఎంసీని లోపాలు సరిదిద్దుకోమని చెప్పేందుకేనని, ఈ పని చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తనను జైలుకు పంపవద్దని అభ్యర్థిస్తూ 'డిస్‌క్లైయిమర్'గా పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో దుకాణానికి లీజ్ అగ్రిమెంట్ లేనట్లు పేర్కొనడంతోపాటు ఐడీ ప్రూఫ్‌గా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను జత చేసినా ట్రేడ్ లైసెన్స్ జారీ అయిందని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను వీడియోగా కూడా విడుదల చేశారు. మిగతా వారి పేరిట దరఖాస్తు చేస్తే ఊరుకోరని, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన అక్క అయినందున తనను కొట్టదనే నమ్మకంతోనే ఆమె పేరిట దరఖాస్తు చేశానని వ్యాఖ్యానించారు. జీహెచ్‌ఎంసీ ఈ తీరు వల్ల సంస్థ ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లుతోందని శ్రవణ్ పేర్కొన్నారు.

బల్దియా బాగు కోసమే..

ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ అనేది పర్మనెంట్ కాకపోయినా, తప్పుడు వివరాలని తేలితే ఆటోమేటిక్‌గా రద్దవుతుందని లైసెన్సులోనే ఉన్నా.. ప్రొవిజనల్‌ది జనరేట్ అయ్యాక క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, నమోదు చేసిన వివరాల్లో తేడా ఉంటే తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదన్నారు. తద్వారా బడా ట్రేడర్ల నుంచి జీహెచ్‌ఎంసీకి ఆశించినంత ఫీజు రావడం లేదని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. ట్రేడర్లు చేసుకున్న దరఖాస్తు కనుగుణంగా ఫీజు తప్ప అధికారులు తనిఖీలు చేసి తప్పులు చూసి, ఫీజులు పెంచింది లేదని ఆయన ఆరోపించారు. జీహెచ్‌ఎంసీలోని లోపాల్ని సరిదిద్దుకోవడానికే తానీ పని చేశానని పేర్కొన్నారు. మల్కాజిగిరి కార్యాలయంలో 10గీ10 గదికి ట్రేడ్ లైసెన్సు జారీ అయిందన్నారు. నడుస్తున్న డ్రగ్‌మార్ట్ వ్యాపారానికి ఈ సంవత్సరం ఫీజుగా రూ.300 ట్రేడ్‌లైసెన్సుకు, రూ.50 గ్రీన్‌ఫండ్‌గా పేర్కొన్నారని వివరించారు.

విప్లవం కోసం అడవికి..

విగతజీవిగా ఇంటికి..

- అన్యాయంగా చంపేశారంటున్న కుటుంబ సభ్యులు
- అంతర్గత విషయాలు బయటకొస్తాయనే హత్య చేశారని ఆరోపణ
- న్యూఇందిరానగర్‌లో విషాదఛాయలు
- సాయిబాబానగర్ శ్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు



రాధ అలియాస్ నీల్సో పార్థివదేహం

కాప్రా: విప్లవం కోసం ఉద్యమంలోకి వెళ్లిన మహిళా మావోయిస్టు పల్లెపాటి రాధ అలియాస్ బంటి రాధ అలియాస్ నీల్సో జీవితం విషాదాంతంగా ముగిసింది. కాప్రా సర్కిల్, న్యూ ఇందిరానగర్‌కు చెందిన రాధ డిప్లొమా ఇన్ ల్యాబొరేటరీ టెక్నాలజీ పూర్తి చేసింది. అనంతరం విప్లవంపై ఆకర్షితురాలై అడవిబాట పట్టిన రాధ తిరిగి విగతజీవిగా ఇంటికి చేరింది. ఇన్‌ఫార్మర్ నెపంతో సహచర మావోయిస్టులే ఆమెను హత్య చేశారు. ఓ మహిళా మావోయిస్టును తోటి మావోయిస్టులే హతమార్చడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, చెన్నాపురం అటవీప్రాంతంలో వెలుగు చూసిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. రాధ మరణవార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గురువారం ఉదయం రాధ భౌతికకాయాన్ని ఇందిరానగర్‌లోని ఇంటికి తీసుకొచ్చారు. ఆరేళ్ల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కుమార్తె విగత జీవిగా తిరిగి ఇంటికి చేరడంతో తల్లిదండ్రుల రోదనలతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి. సాయిబాబానగర్‌లోని శ్మశానవాటికలో రాధ అలియాస్ నీల్సో దహన సంస్కరాలు పూర్తి చేశారు.

అన్యాయంగా చంపేశారు

మావోయిస్టుల అంతర్గత విషయాలు బయటకొస్తాయనే రాధను అన్యాయంగా చంపేశారని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. విప్లవ బాటపట్టిన మావోయిస్టుల్లోనూ అగ్ర వర్ణాలు, అణగారిన వర్గాలు అనే తారతమ్యం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబానికి చెందని ఆడబిడ్డనే రాధను సహచర మావోయిస్టులు చంపేశారని ఆరోపిస్తున్నారు. మావోయిస్టుల్లో కొందరు చేసిన తప్పులను రాధ ప్రశ్నించిందని, వారి గుట్టు బయటపడుతుందనే భయంతోనే చంపేశారని చెబుతున్నారు. రాధ ఇన్‌ఫార్మర్‌గా మారిందనడానికి ఆధారాలు ఏమున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఆరేళ్లుగా లేని అనుమానం ఇప్పుడే ఎందుకు వచ్చింది, మూడు నెలల క్రితం కమాండర్ బాధ్యతల నుంచి తప్పిస్తే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎందుకు ఆగారు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు జరిగిన అన్యాయంపై స్పందించాలని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రాధ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దళిత మహిళ అనే వివక్ష



ఒక దళిత కుటుంబానికి చెందిన ఆడబిడ్డనే మా చెల్లెను అన్యాయంగా చంపేశారు. ఇన్‌ఫార్మర్ నేపంతో సహచర మావోయిస్టులే చంపి రోడ్డుపై పడేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తే మృతదేహం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అక్కడ ఏరియా ఆస్పత్రికి మేం వెళ్లేసరికే రాధ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అసలు తల్లిదండ్రులు లేకుండా వారికి సమాచారం అందించకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా రాధ మృతదేహానికి పోస్టుమార్టం ఎలా చేస్తారు.

– లింగం, రాధ అన్నయ్య.

నా బిడ్డను చూస్తా అనుకున్నా



మూడు రోజుల్లో నా బిడ్డ ఇంటికొస్తుందని తెలిసింది. చాలా ఏళ్ల తర్వాత నా బిడ్డను చూస్తా అనుకున్నా. అంతలోనే రెండు రోజుల తర్వాత చనిపోయిందని చెప్పారు. బిడ్డ ఇక లేదని తెలియడంతో చివరి చూపు కోసం బుధవారం మధ్యాహ్నం అక్కడికి బయలుదేరాం. మేం వెళ్లేసరికే పోస్టుమార్టం పూర్తి చేశామని చెప్పి, మృతదేహాన్ని అప్పగించేశారు. ఇన్‌ఫార్మర్ పేరుతో నా బిడ్డను అన్యాయంగా చంపేశారు. నా కొడుకుపై కూడా ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

–పోచమ్మ(బాలమ్మ), రాధ తల్లి



విలపిస్తున్న రాధ తండ్రి బాలయ్య

ఇన్‌ఫార్మర్ అనడం అబద్ధం



మా అక్క రాధను ఇన్‌ఫార్మర్ అని చెప్పడం పచ్చి అబద్ధం. ఆరేళ్ల క్రితం మావోయిస్టుల పార్టీలో చేరిన అక్క ఫ్యామిలీ గుర్తుకు వచ్చినప్పుడు కేవలం మెసేజ్ మాత్రం చేసేది. అది కూడా ఆమె వెళ్లిన తర్వాత రెండేళ్ల క్రితం ఒక్క మెసేజ్ చేసింది. ఎలా ఉన్నారు, అమ్మ, నాన్న ఎలా ఉన్నారు అని ఆరా తీసింది. మేం బాగానే ఉన్నాం, నువ్వు ఇంటికి రావొచ్చు కదా అంటే నన్ను మర్చిపోండి, నేను మావోయిస్టుల్లోనే ఉంటానని చెప్పింది. అలాంటి మా అక్క ఇన్‌ఫార్మర్ అని ముద్ర వేసి అన్యాయంగా చంపేశారు. ఆ తర్వాత ఈ నెల 18న నాకు మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్ చేసింది మా అక్క కాదని గుర్తించా. అక్కకు ఏం జరిగిందోననే భయంతో మాకు తెలిసిన వ్యక్తి ద్వారా ఆరా తీశా. ఆ తర్వాతి రోజునే చనిపోయిందని తెలిసింది. ఈ నెల 21న చనిపోయిందని ఫొటో వాట్సాప్ చేశారు. కానీ ఆ ఫొటోలో 19వ తేదీ కనిపించింది. అంటే మా అక్క చనిపోయిన తర్వాత రెండు రోజులకు మాకు సమాచారం అందింది. నాకు డబ్బులు పంపేదని ఆరోపిస్తున్నారు. అలా అయితే నేను క్యాబ్ డ్రైవర్‌గా ఎందుకు పని చేస్తాను.

–సూర్యప్రకాష్, రాధ తమ్ముడు

విధుల్లో ఉండగా గుండెపోటు



మల్లయ్య పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

- కడ్తాల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య మృతి
- నివాళులర్పించిన డీసీపీ రాజేశ్, నేతలు



మల్లయ్య (ఫైల్)

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య(51) గురువారం ఉదయం మృతిచెందాడు. అర్ధరాత్రి ఒంటిగంటకు ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది మల్లయ్యను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని డీఆర్‌డీఏ అపోలోకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్మాస్‌గూడకు చెందిన మల్లయ్య 2016 నుంచి కడ్తాల్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, కడ్తాల్ సీఐ శివప్రసాద్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పోలీసు అధికారిక లాంఛనాలతో అల్మాస్‌గూడలో అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎల్ఎన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంబాల పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు వీరయ్య, లచ్చిరాంనాయక్, బొప్పిడి గోపాల్, చంద్రమౌళి, హరిచంద్‌నాయక్, రామకృష్ణ, లాయక్‌అలీ, వెంకటేశ్, శ్రీకాంత్, బిక్యానాయక్, యాదయ్య తదితరులు కడ్తాల్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తుక్కుగూడ: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో చేపట్టిన దరఖాస్తుల పరిశీలనను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ కోసం అర్జీ పెట్టుకున్న ప్లాట్ల వివరాలను సీజీజీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో 2541 దరఖాస్తులు రాగా గతంలో 688 పరిష్కరించారని, మిగతా 1853 అప్లికేషన్లను క్రమబద్ధీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ సిబ్బంది సంయుక్తంగా పని చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రవి(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఎస్ఐ బల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్నగూడ గ్రామానికి చెందిన పాత్లావత్ రవి(40) మద్యానికి బానిసై భార్య అమృతతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రవి ఈ నెల 2న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రవిని షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఉస్మానియాకు రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



అంజమ్మ(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గృహ ప్రవేశానికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధి రాయికల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామానికి చెందిన అంజమ్మ(68) బుధవారం రాయికల్‌లో బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఆమె దారి తప్పింది. గురువారం ఉదయం వరకు ఆమె ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం ఆమె కొడుకు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పద్మ తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

అత్తాపూర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ హుస్సేన్, ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నరసింహారావు ఎలివెటెడ్ ఎక్స్‌ప్రెస్ వే-236 పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు(35) ఉంటుందని, శరీరంపై పింక్ కలర్‌తో కూడిన చెక్స్ షర్ట్, కాకి కలర్ ప్యాంటు ధరించాడని, కుడిచేతిపై అమ్మానాన్న అనే పచ్చబొట్టు, టీషర్ట్‌పై ఉన్నాయని మృతుడి ఆచూకి తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరు అరెస్ట్



పోలీసుల అదుపులో నాటుసారా విక్రేత

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధి కడ్తల్ మండల పరిధిలో గురువారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. మైసిగండిలోని మైసమ్మ దేవాలయం వద్ద తనిఖీలు చేస్తుండగా.. మాడ్గుల మండలం కాట్రావత్‌తండాకు చెందిన కోటియా వద్ద నాలుగు లీటర్ల నాటుసారా, తలకొండపల్లి మండలం తాల్లగుట్టతండాకు చెందిన రాత్లావత్‌బిచ్యా వద్ద 1 లీటర్ సారాను పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్ ఎదుట ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైసమ్మ ఆలయం సమీపంలోని ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు, ఫంక్షన్‌హాళ్లలో అనుమతి లేకుండా మద్యం ఈవెంట్లు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు సంబంధిత హాల్స్ యజమానులపై చర్యలు తీసుకుంటామని సీఐ చౌహాన్ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ స్వప్న, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది దశరథ్, శ్రీజ, ప్రవీణ్, లోక్యా, రాంరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?



పోలీస్ స్టేషన్ ముందు మాలతి

హస్తినాపురం: ఇంటి అద్దె కోసం వెళ్తే కులం పేరు అడిగి ఎస్సీలకు అద్దెకివ్వమని అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే.. పోలీసులు పట్టించుకోవడంలేదని ఓ మహిళ ఆరోపించింది. ఈ సందర్భంగా బాధితురాలు కమటం మాలతి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18న కూతురు ఆకాంక్ష, ఆమె స్నేహితురాలితో కలిసి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని దాసరి ఉద్దానయ్య ఇంట్లో అద్దె కోసం వెళ్లగా.. రూ.22 వేలు కిరాయి అని చెప్పారు. ఆ తర్వాత ఉద్దానయ్య మా కూతురు ఆకాంక్షను కులం అడగగా ఎస్సీ అని చెప్పింది. దీంతో అతను ఇల్లు అద్దెకివ్వమని చెప్పడంతో నా కూతురు మనస్తాపానికి గురైందని తెలిపారు. అదే రోజు వనస్థలిపురం పోలీసులు ఫిర్యా చేశాను. తర్వాత వెళ్లి అడిగితే నా దృష్టికి రాలేదని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. తిరిగి మరోసారి మార్చి ఈ నెల 20న మరో ఫిర్యాదు రాయించి ఇచ్చానని ఆమె చెప్పారు. ఐదు రోజులుగా ఠాణా చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం మాలతి ఆరోపించింది. గంటల తరబడి ఠాణాలో కూర్చోబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పోలీస్‌స్టేషన్ ముందే ఆత్మహత్య చేసుకుంటామని బాధితురాలు మాలతి ఆవేదన వ్యక్తంచేశారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

ముఠా గుట్టురట్టు

- 17 మంది విదేశీ యువతులు హోమ్‌కు తరలింపు
- ఆర్గనైజర్‌తో పాటు ఇద్దరు విటుల అరెస్ట్

గచ్చిబౌలి: విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్‌ను ఏహెచ్‌టీయూ, గచ్చిబౌలి పోలీసులు గుట్టురట్టు చేశారు. ఆర్గనైజర్ సహా ఇద్దరు విటులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధిత యువతులను కోర్టు ఆదేశాలతో సేఫ్ హోంకు తరలించారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కైత్లాపూర్‌కు చెందిన శివకుమార్ కొండాపూర్‌లోని ప్రొఫెసర్స్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకుని సర్వీస్ అపార్ట్‌మెంట్‌గా మార్చాడు. విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఏహెచ్‌టీయూ, గచ్చిబౌలి పోలీసులు బుధవారం రాత్రి సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. కెన్యాకు చెందిన 14 మంది, ఉగాండాకు ఇద్దరు, టాంజానియాకు చెందిన ఒక యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్గనైజర్ శివకుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విటులు నాగ రాకేష్, అహ్మద్‌లకు నోటీసులు జారీ చేశారు. ఘటనా స్థలంలో రూ.20 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. బాధిత యువతులను కోర్టు ఆదేశాలతో సేఫ్ హోంకు తరలించారు.

నెల రోజులుగా దందా

విజిటింగ్ వీసాపై కెన్యా, ఉగాండా, టాంజానియా నుంచి వచ్చిన యువతులకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. లోకాంటో వెబ్‌సైట్‌లో యువతుల ఫొటోలు పెట్టి విటులను ఆకర్షిస్తున్నారు. ఒక్కో విటుని నుంచి రూ.10 నుంచి 15 వేలు వసూలు చేస్తున్నారు. బాధిత యువతుల్లో ఇద్దరు గతంలోనూ బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో పీటా కేసుల్లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. వీరు ఢిల్లీ, ముంబై, బెంగళూర్ నగరాల్లోనూ సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

యాచారం: కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి మాల్ చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారును సోదా చేస్తుండగా.. అందులో భారీగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

తల్లి మరణం తట్టుకోలేక కూతురు మృతి

మంతన్‌గౌరెల్లిలో విషాదఛాయలు



పోచమ్మ(ఫైల్)



బుచ్చమ్మ(ఫైల్)

యాచారం: తల్లి మరణం తట్టుకోలేక కూతురు మృతి చెందిన సంఘటన మంతన్‌గౌరెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంతన్‌గౌరెల్లికి చెందిన కందుల పోచమ్మ(65) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందింది. పోచమ్మకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కుమార్తె బుచ్చమ్మ(40)కు అదే గ్రామంలోని బుస్సు క్రిష్టయ్యతో పెళ్లి చేశారు. బుచ్చమ్మకు తల్లి పోచమ్మ అంటే ఎంతో ప్రేమ ఉండేది. ఈ క్రమంలో అమ్మ మృతిని జీర్ణించుకోలేని ఆమె.. తీవ్ర మనోవేదనకు గురైంది. నీరు, ఆహారం తీసుకోకపోవడంతో అలసటతో అస్వస్థతకు లోనైంది. కుటుంబ సభ్యులు ఆమెను మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయింది. 24 గంటల వ్యవధిలో తల్లి, కూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

తల్లి, కూతురు అదృశ్యం



పాపతో తల్లి భారతి (ఫైల్)

కేశంపేట: బిడ్డతో పాటు తల్లి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగడ్డతండా పరిధి గుట్టలగడ్డతండాకు చెందిన కేతవత్ భాస్కర్‌కు హైదరాబాద్‌లోని కిష్టారెడ్డి పేటకు చెందిన భారతితో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుతుర్లు, ఓ కుమారుడు ఉన్నాడు. గురువారం మధ్యాహ్నం భార్య భారతి సొంత పొలంలో పనులకు వెళ్లగా.. భర్త భాస్కర్, ట్రాక్టర్‌తో ఇప్పలపల్లి శివారులో పొలం దున్నడానికి వెళ్లాడు. అనంతరం భాస్కర్ మధ్యాహ్నం తన పొలం వద్దకు వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. ఇంటికి వెళ్లి చూడగా.. చిన్నారి కనిపించలేదు. చిన్నారితో కలిసి వెళ్లిందని గుర్తించి.. తెలిసిన చోట్ల వారి కోసం వెతికాడు. ఆచూకీ తెలియరాలేదు. దీంతో భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య గతంలో నాలుగు సార్లు ఇలాగే ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.